www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -29 బుధవారం13 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# నీట్ పరీక్ష రద్దు

## రాజస్తాన్‌లో ప్రశ్నాపత్రం లీక్ : కేసు నమోదు చేసిన సీబీఐ

**మహారాష్ట్రలో ఒకరి అరెస్ట్**

**ఈనెల 3న దేశవ్యాప్తంగా జరిగిన పరీక్ష**


**22 లక్షల మంది విద్యార్థులకు నిరాశ**

**నిరుత్సాహంలో తల్లిదండ్రులు**

**మోడీ సర్కార్ వైఫల్యాలకు నిదర్శనం**

**మళ్లీ పరీక్ష నిర్వహిస్తాం..**

**: ఎన్‌టీఏ డీజీ అభిషేక్‌సింగ్**




**న్యూఢిల్లీ : మే, 12 (ప్రజావినికిడి):** దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మక ప్రవేశపరీక్ష నీట్ యూజీ-2026 రద్దయ్యింది. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం రాజస్తాన్‌లో లీక్ అయ్యిందనే ఆరోపణలతో ఈ ప్రవేశ పరీక్షను రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఈ నెల 3వ తేదీ జరిగిన నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా 22 లక్షలమంది రాసారు. పరీక్షల్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రశ్నాపత్రం లీకైన విషయం నిర్ధారణ కాగానే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ కేంద్రాన్ని సంప్రదించారు. కేంద్రం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే ప్రశ్నాపత్రాలు ముద్రించిన నాసిక్ ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఒకర్ని ఆరెస్టు చేసినట్టు తెలిసింది. లీకేజీతో నష్టపోయిన ఆశావాహులకు న్యాయం చేయడానికి త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామనీ, దీనికి సంబంధించిన తేదీని త్వరలో ప్రకటిస్తామని ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ప్రక్రియ పదిరోజుల్లో ప్రారంభమవుతుందని తెలిపింది. మళ్లీ పరీక్ష రాయబోయే విద్యార్థులు ఎవరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పాత రిజిస్ట్రేషన్ డేటానే పరిగణలోకి తీసుకుంటామని**మిగతాది 2లో...**




# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

## కృష్ణా జలాలు పంపిణీ చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయం

**ఈ నెల 14న మరోసారి సమావేశం**

**హైదరాబాద్ మే, 12 (ప్రజావినికిడి):** వేసవిలో తాగు నీటి అవసరాలకు గాను తెలంగాణకు 22 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో **మిగతాది 2లో...**

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

**రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం**

**స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ**

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో**మిగతా 2లో...**

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

## కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

**సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు**

**ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే**

**అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ**

**లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి**



**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):** ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. **మిగతాది 2లో...**

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

**మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణల కేసు**

**మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని నోటీసులు**

**కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం**



**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):** కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణలతో అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలంటూ సిట్ నోటీసులు పంపించింది.**మిగతాది 2లో...**

# పార్టీ బలోపేతంపై ఫోకస్

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

**ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్**

**పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం**

**పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఫోకస్**



**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది.**మిగతాది 2లో...**

# దేశవ్యాప్తంగా నిర్మాణాలపై రెండేళ్ల నిషేధం వార్తలను ఖండించిన నీతి ఆయోగ్

**ఈ మేరకు ఎలాంటి సిఫార్సు చేయలేదని ఎక్స్ వేదికగా స్పష్టత**

**పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో నిర్మాణాలు ఆపాలంటూ తప్పుడు ప్రచారం**

**ప్రభుత్వ కార్యాలయాల పునర్నిర్మాణంపై వాయిదా సూచనలు ఇవ్వలేదని వెల్లడి**

**పెరిగిన వ్యయాలు, సరఫరా గొలుసు అంతరాయాలే కారణమంటూ తప్పుడు కథనాలు**

NITI Aayog

# పార్టీ బలోపేతంపై ఫోకస్



(మొదటి పేజి తరువాయి)
ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ సవాళ్లపై ఈ సమావేశంలో నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తూనే, ప్రజల్లోకి పార్టీని మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ సమావేశంలో సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, అలాగే జిల్లా పర్యటనల ద్వారా క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

# బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

(మొదటి పేజి తరువాయి)
మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.బండి భగీరథ్ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీని ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసు సిట్ విచారిస్తోంది. బండి భగీరథ్‌పై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరోవైపు, తనను హనీట్రాప్ చేశారని బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

### హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్ కుమారుడు

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.
తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని, ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన (బుధవారం) హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. న్యాయస్థానం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.
కేసు వివరాల్లోకి వెళితే... ఒక 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అయితే, ఈ ఆరోపణలను భగీరథ్ తరపున వర్గాలు ఖండిస్తున్నాయి. ఇది కావాలని చేస్తున్న కుట్రగా వారు పేర్కొంటున్నారు.
మరో ఆసక్తికరమైన మలుపు ఏంటంటే... ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు (మే 8) కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది.

# దేశవ్యాప్తంగా నిర్మాణాలపై రెండేళ్ల నిషేధం వార్తలను ఖండించిన నీతి ఆయోగ్

**ఈ మేరకు ఎలాంటి సిఫార్సు చేయలేదని ఎక్స్ వేదికగా స్పష్టత**

**పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో నిర్మాణాలు ఆపాలంటూ తప్పుడు ప్రచారం**

**ప్రభుత్వ కార్యాలయాల పునర్నిర్మాణంపై వాయిదా సూచనలు ఇవ్వలేదని వెల్లడి**

**పెరిగిన వ్యయాలు, సరఫరా గొలుసు అంతరాయాలే కారణమంటూ తప్పుడు కథనాలు**

**న్యూఢిల్లీ, మే, 12 (ప్రజావినికిడి):**
దేశవ్యాప్తంగా నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు వస్తున్న వార్తలను నీతి ఆయోగ్ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని మంగళవారం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది.పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా దేశంలో నిర్మాణాలను రెండేళ్లు నిలిపివేయాలని నీతి ఆయోగ్ సలహా ఇచ్చినట్లు మే 12న ఒక మీడియా కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని ఉటంకిస్తూ స్పందించిన నీతి ఆయోగ్, "నిర్మాణాలపై నిషేధం విధించాలని మా సంస్థ ఎలాంటి సిఫార్సు చేయలేదని స్పష్టం చేస్తున్నాం" అని పేర్కొంది.ముఖ్యంగా, ఢిల్లీలోని నిర్మాణ్ భవన్, ఉద్యోగ్ భవన్, శాస్త్రి భవన్ వంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల కూల్చివేత, పునర్నిర్మాణ ప్రాజెక్టులను వాయిదా వేయాలని సూచించినట్లు ఆ కథనంలో పేర్కొన్నారు. అయితే, ఈ భవనాల పునర్నిర్మాణ ప్రణాళికలను సంబంధిత మంత్రిత్వ శాఖలే చూసుకుంటున్నాయని, ఆ ప్రక్రియను వాయిదా వేయాలని తాము ఎలాంటి సూచన చేయలేదని నీతి ఆయోగ్ తేల్చిచెప్పింది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇంధన వాడకాన్ని తగ్గించుకోవాలని, విదేశీ ప్రయాణాలను పరిమితం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నిర్మాణాలను నిలిపివేయాలన్న వదంతులకు ప్రాధాన్యత ఏర్పడింది. తాజాగా నీతి ఆయోగ్ ప్రకటనతో ఈ ప్రచారానికి తెరపడినట్లయింది.?

# తెలంగాణకు 22, ఏపీకి 10 టీఎంసీలు

(మొదటి పేజి తరువాయి)
జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, ఏ రాష్ట్రానికి ఎంత నీరు విడుదల చేయాలనే అంశంపై చర్చించి ఈ వేసవి వాటాలను బోర్డు నిర్ణయించింది. తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి 10 టీఎంసీలు ఏపీకి, తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 5 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతిచ్చింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలిపిన తెలంగాణ, సాగర్‌లో ఏపీకి 10 టీఎంసీలు పోగా మిగిలిన మొత్తం నీరు తమకే చెందుతుందని వాదించింది. తాగునీటి అవసరాల కోసం నీటిని అడుగుతున్నట్టు ఏపీ ఈఎన్సీ తెలిపారు. మిగతా అంశాలు కాకుండా అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేలా నిర్ణయం తీసుకుందామని బోర్డు సభ్య కార్యదర్శి తెలిపారు. దాంతో రెండు రాష్ట్రాలు బోర్డు నిర్ణయాన్ని అంగీకరించారు. కాగా తమకు 18 టీఎంసీలు కావాలని తెలంగాణ అభ్యర్థించగా, మరో మూడు టీఎసీలు అదనంగా కేటాయించడం గమనార్హం. ఈ ఒప్పందం ఆగస్టు 15 వరకు అమల్లో ఉంటుందని కేఆర్ఎంబీ వర్గాలు తెలిపారు. ఈ నెల 14న కేఆర్ఎంబీ 21వ సమావేశం జరగనుంది. కృష్ణానది నీటి వాటాలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీష్ కాంబోజు, తెలంగాణ, ఏపీలకు చెందిన ఈఎన్సీలు రమేశ్‌బాబు, నరసింహామూర్తి పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దు- సిబిఐ విచారణ

(మొదటి పేజి తరువాయి)
కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.
కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుని పరిశీలించిన సమాచారంతో పాటు, చట్ట సంస్థలు పంచుకున్న దర్యాప్తు వివరాల ఆధారంగా మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ అనుమతితో నిర్ణయించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ ఏడాది నీట్-యూజీ పరీక్ష దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సుమారు 23 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు నమోదు చేసుకున్నారు. చట్ట అమలు సంస్థల నుంచి అందిన సమాచారం, దర్యాప్తు సంస్థల నివేదికలను సమగ్రంగా పరిశీలించిన తరువాత ప్రస్తుతం నిర్వహించిన పరీక్షా ప్రక్రియను కొనసాగించడం సాధ్యం కాదని తేలినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. మళ్లీ నిర్వహించే పరీక్ష తేదీలు, కొత్త అడ్మిట్ కార్డుల విడుదల షెడ్యూల్‌ను త్వరలో అధికారిక మార్గాల ద్వారా వెల్లడిస్తామని తెలిపింది, ఇక ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తూ సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. దర్యాప్తుకు అవసరమైన అన్ని రికార్డులు, పత్రాలు, సహాయాన్ని సీబీఐకి పూర్తిగా అందజేస్తామని సంస్థ స్పష్టం చేసింది. జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని పరిరక్షించడం, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నీట్-యూజీ 2026 పరీక్షను రద్దు చేసినట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) తెలిపింది.పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల విద్యార్థులు, వారి కుటుంబాలు నిజమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని అంగీకరించిన ఎన్‌టీఏ, అయితే పరీక్షా వ్యవస్థపై నమ్మకానికి దీర్ఘకాలిక నష్టం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తప్పనిసరి అయిందని పేర్కొంది. కొత్తగా పరీక్ష రాసేందుకు విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కరలేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తరువాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

(మొదటి పేజి తరువాయి)
ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

## ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు -ఎన్‌డిఎ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక

**గౌహతి, మే, 12 (ప్రజావినికిడి):** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు.అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.
హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ,





బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

(మొదటి పేజి తరువాయి)
మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం13 మే 2026

# ఫాతిమాపూర్ చర్చి వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఫాతిమా మాత భక్తి విశ్వాసాలను ప్రపంచమంతటా కొనియాడుచున్నారని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్ లో వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తీగాపూర్ సర్పంచ్ జయప్రద జగన్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్,మాజీ వార్డు సభ్యులు కుమ్మరి వెంకటేష్,పీర్లగూడెం శ్రీశైలం గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షుడు నందు గౌడ్.బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్,శివ చారి,ఫాదర్ సోలమన్,ఫాదర్ బాల,దిలీప్ రెడ్డి, అల్బిన్ రెడ్డి, మరెడ్డి, బాల్రెడ్డి,చిన్నపరెడ్డి,జోసెఫ్ రెడ్డి,ఇన్నారెడ్డి, మారెడ్డి,జైపాల్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,వినయ్ రెడ్డి,తుమ్మ దిలీప్ రెడ్డి,ఆరోగ్య రెడ్డి,నీలిష్ రెడ్డి,మాథియాస్ రెడ్డి,భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కోశాధికారిగా డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నికలలో రంగారెడ్డి జిల్లా కోశాధికారిగా డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్ అలాగే ముజీబ్ ఆధ్వర్యంలో జరిగాయి, అనంతరం షాద్ నగర్ టీఎన్జీవో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జే. శ్రీనివాసులు పి. శ్రీహరి ఆధ్వర్యంలో కోశాధికారి ఆనంద్ సింగ్ కు సన్మానం చేయడం జరిగింది.



# హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**నాగోల్,(ప్రజావినికిడి):**హనుమాన్ జయంతి సందర్భంగా నాగోల్ డివిజన్ పరిధిలోని రామాలయం దేవాలయం నందు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఆనంతుల రాజిరెడ్డి,చంద్రశేఖర్ అజాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో మోడీ చెలగాటం

**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి ):**
దేశ వ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ యూజీ 2026 పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్న గందరగోళం,పేపర్ లీక్ ఆరోపణలు దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి స్పష్టమైన ఉదాహరణ అన్నారు.
ఇంత కీలకమైన జాతీయ స్థాయి పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి, ఎన్టీఏ ఎగ్జామ్స్ పై ఉందన్నారు. కానీ పరీక్ష జరిగిన తర్వాత పేపర్ లీక్ అంశాలు బయటకు రావడం లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సంవత్సరం కాదు ప్రతి ఏడాది ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని ఆవేదన వక్తం చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు దీన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రశ్నించారు.



విద్యార్థుల భవిష్యత్తు పట్ల మోదీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దేశ వ్యాప్తంగా విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుతుంటే కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ నిర్లక్ష్యం వల్ల వారి కష్టం, సమయం, మానసిక స్థితి దెబ్బతింటోంది.
**ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ డిమాండ్..:** నీట్ నిర్వహణలో జరిగిన లోపాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి. పేపర్ లీక్ ఘటనపై పూర్తి నిజాలు బయటపెట్టాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు వెంటనే స్పష్టత ఇవ్వాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పురావృతం కాకుండా పారదర్శక వ్యవస్థను తీసుకురావాలి. విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం ఆపాలి. దేశ యువత నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఆప్ రాష్ట్ర వర్కింగి ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ అన్నారు.

# సాయి భగీరథున్ని ఎందుకు దాచిపెడుతున్నారు

**అంబర్ పేట్,(ప్రజావినికిడి):**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథున్ని ఎందుకు దాచిపెడుతున్నారని,ఏ తప్పు చేయనప్పుడు చట్టం ముందుకు ఎందుకు నిలబెడుతలేవు అని కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర నాయకులు మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబర్ పేట నియోజకవర్గం తిలక్ నగర్ చౌరస్తాలో తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ, దేశంలో బిజెపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని మండిపడ్డారు. మైనర్ బాలికను అత్యాచారం చేసిన దుర్మార్గుడు సాయి భగీరత్ పై అనేక కేసులు ఉన్నాయని ఇలాంటి వ్యక్తిని ఎందుకు రక్షిస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి బండి సంజయ్ మహిళల పట్ల కించపరిచేట్టు వ్యాఖ్యలు చేస్తున్నారని మహిళలకు రక్షణ లేదన్నారు. బాధితురాలు కుటుంబాన్ని అధికార దుర్వినియోగంతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. బిజెపి మహిళా నాయకులు ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి వై. వరలక్ష్మి,కేవీపీస్ కార్యదర్శి. సుబ్బారావు, రాములు, నాగేందర్,డి. రాములు, కురుమయ్య, నాగులు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.




# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి..

## ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతతో కలిసి దిల్ సుఖ్ నగర్ వరకు వారితో పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీలు అమలు కాలేదని ఆయన విమర్శించారు. అలాగే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ దానిపై స్పష్టత




లేకపోవడం నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారుఅదేవిధంగా జీవో 29 అదేవిదంగా జీవో 46లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రూప్-1 నియామకాల్లో చోటుచేసుకున్న అనుమానాలపై సిట్ ఎంక్వయిరీ నిర్వహించి పారదర్శకంగా విచారణ చేపట్టాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు బిచేనేపల్లి వెంకటేశ్వరరావు,గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్,డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్,రమణారెడ్డి,శైలజ,గండి సన్నీ యాదవ్, ప్రతీక్,శివరాం,విక్కీ,సమ్మ రాము,ప్రదీప్,రవీందర్ రెడ్డి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్-2 నందు నిన్న రాత్రి జరిగిన వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాలుడు అద్విక్‌ను మంగళవారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరామర్శించారు.
ఈ సందర్భంగా బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న సుధీర్ రెడ్డి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి సూచించారు. అద్విక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాలుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అలాగే నియోజకవర్గంలో వీధి కుక్కల సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# ఆపో్క కాలనీలో డ్రైనేజీ సమస్యపై తూర్పాటి చిరంజీవి పర్యటన

**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ పరిధిలోని ఆపో్క కాలనీలో చాలా కాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ అలాగే మురికినీటి సమస్యపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైటెన్షన్ వైర్ల కింద ఉన్న ల్యాండ్ మార్క్ అపార్ట్మెంట్ నుండి వెలువడుతున్న మురికినీరు కాలనీలోకి చేరుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ సమస్యపై ఇప్పటికే అపార్ట్మెంట్ యాజమాన్యంతో పలుమార్లు చర్చించినప్పటికీ ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో కాలనీవాసులు సమస్యను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.
దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమస్య తీవ్రతను తెలుసుకుని, కాలనీలో ప్రత్యక్షంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి కి ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈనెల 12న మంగళవారం తూర్పాటి చిరంజీవి ఆపో్క కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను



పరిశీలించిన ఆయన, డ్రైనేజీ పరిస్థితిని స్వయంగా పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. మురికినీటి కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.
అనంతరం చిరంజీవి మాట్లాడుతూ, కాలనీవాసుల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి పూర్తిస్థాయిలో తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆపో్క కాలనీ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అంకరాజు చిరంజీవి, అపార్ట్మెంట్ వాసులు రాజేష్,శంకర్, కాలనీవాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నేషనల్ డెయిరీతో నార్ముల్ ఒప్పందం

## పాడిరైతులకు తొలుత పదికోట్లు చెల్లింపు




**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):**నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్ముల్), నేషనల్ డెయిరీ డెవలంప్‌మెంట్ బోర్డుతో త్రైపాక్షిక ఒప్పందం కుదర్చుకుంది. 15 ఏళ్లపాటు డెయిరీ అభివృద్ధి చేసే బాధ్యతను అది తీసుకోనుంది. ఒప్పందంలో భాగంగా మొదట పాడి రైతుల బకాయిలను చెల్లించేందుకు రూ.10 కోట్ల రూపాయలను చెల్లించనుంది. ఈ మేరకు ఎన్‌డిబిబి అధికారులతో తెలంగాణ రాష్ట్ర డెయిరీ విభాగం అధికారులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక, డెయిరీ, ఫిషరీస్ సెక్రటరీ ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఔఆఆః అధికారులు పాల్గొన్నారు.

# చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

## ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం

## అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష

**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):**



తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ ప్రక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంరక్షణలో కూడా వెట్‌ల్యాండ్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెట్‌ల్యాండ్స్ సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, జీవ వైవిధ్య పరిరక్షణలో కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

------------------------

# చిన్నారి హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష

## కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):** ఓ బాలుడి హత్య కేసులో కూకట్‌పల్లి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. చిన్నారిని హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష విధించింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లో 2023 సంవత్సరంలో జరిగిన మైనర్ హత్యోదంతం సంచలనం సృష్టించింది. ఇమ్రాన్ అలీ ఖాన్ (33) అనే వ్యక్తి చిన్నారిని హత్య చేయగా.. అతనికి మహమ్మద్ రఫీక్ (32) సహకరించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీసులు అప్పుడే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఇమ్రాన్ అలీ ఖాన్, మహమ్మద్ రఫీక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. కేవలం సాంకేతిక సాక్ష్యాలతో కేసును ఛేదించి.. వివరాలను కోర్టుకు సమర్పించారు. పకడ్బందీగా సాక్ష్యాలు ఉండటంతో సంతృప్తి చెందిన కూకట్‌పల్లి కోర్టు.. చిన్నారిని వారే హత్య చేసినట్లు నిర్ధారిస్తూ దోషులుగా తేల్చింది. ఇమ్రాన్ అలీ ఖాన్‌కు మరణశిక్ష, అతనికి సహకరించిన మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటేశ్వర రావు తీర్పు వెలువరించారు.

# చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు

## కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ



**కరీంనగర్, మే, 12 (ప్రజావినికిడి):** తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆవేదన చెందారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి..

## రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య.. -దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు.





**రంగారెడ్డి, (ప్రజావినికిడి):**

దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కు, సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ,ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ,వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు,గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా,వీధి దీపాలు,తడి,పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం,ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ,వారి సామాజిక,ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని,పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి,అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు,చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం,



స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి,వృత్తి పన్ను,వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు.స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు.

ఈ సదస్సులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్మయి,దక్షిణ జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జి.ఫణీంద్ర రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీసీ.ఈ.ఓ కృష్ణారెడ్డి,డీపీఓ సురేష్ మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్లు,కమిషనర్ లు,డిపిఓలు, డీఎల్పీఓలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

## బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు -తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా

## చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్

**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):**

స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.

మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను




పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని అధికారులు తెలిపారు.

# భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

## బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా

## మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి)::**కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# పోక్సో కేసులో కుల ప్రసక్తి ఉండదు

## చట్టం అందరికీ ఒకేలా ఉంటుంది

## పొన్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న పిసిసి చీఫ్

**హైదరాబాద్, మే, 12 (ప్రజావినికిడి):**



తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఖండించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసు వ్యవహారంలో మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి పొన్నం వ్యాఖ్యలతో ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కులసంఘం మధ్యవర్తిత్వం, వివాహం ద్వారా ఇలాంటి తీవ్రమైన కేసులను పరిష్కరించుకోవాలని పొన్నం అన్నారని తెలిపారు. పొన్నం సూచనలను కాంగ్రెస్ ఖండిస్తోందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు. మైనర్ల విషయంలో చట్టపరంగా ఇబ్బందులు తప్పవని చెప్పుకొచ్చారు. పోక్సో చట్టప్రకారం నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. నేర పరిశోధనలో నిందితుడి కులం లేదా సామాజిక హోదాతో సంబంధం లేదని తెలిపారు. బండి సంజయ్ ఈ కేసులో కుల రాజకీయాలను తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ కేసులో ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కి ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని తేల్చిచెప్పారు. 'నారీ శక్తి' అని నినాదాలు చేసే బీజేపీ, ఇప్పుడు బాలికపై జరిగిన దాడి విషయంలో మౌనంగా ఉండటం దేనికి సంకేతం..? అని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. బాలిక కుటుంబ సభ్యులను భగీరథ్ బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అన్నారు. నిజమని తేలితే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి రాజకీయ జోక్యం, కుల మతాల ప్రభావం లేకుండా పారదర్శకంగా విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నిందితుడు ఎంతటి శక్తివంతుడైనా సరే, బాధితురాలికి తాము అండగా నిలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# లక్షల మంది విద్యార్థుల క లలు కల్లలు

## నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్




**న్యూఢిల్లీ, మే, 12 (ప్రజావినికిడి):**

నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

# ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులు

## విశాఖ తిరుపతి కలెక్టర్లకు బోర్డులో ప్రాతినిధ్యం

## బోర్డులో కొత్తగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు చోటు

**అమరావతి, మే, 12 (ప్రజావినికిడి):**



ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులను నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంతానికి ప్రతినిధిగా నియమించగా, తిరుపతి కలెక్టర్‌ను రాయలసీమ ప్రాంతానికి ప్రతినిధిగా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా ప్రాంతీయ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కుమారి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నియామకాలు అమల్లో ఉంటాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. మహిళా, శిశు , దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల చేసింది. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం-2019 అమల్లో భాగంగా సంక్షేమ బోర్డు కీలక పాత్ర పోషించనుంది. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సమాన హక్కులు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు సభ్యులను నియమించడంపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారంశైలజ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను మే 4వ తేదీన మంత్రి నారా లోకేశ్ దృష్టికి తాను తీసుకెళ్లానని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయడం కూటమి సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనమని రాయపాటి శైలజ పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్‌లో జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసిని విడుదల చేయాలన్న పవన్

## 500 రోజులుగా నిర్బంధంలో ఉన్నా బెయిల్ నిరాకరించడంపై ఆగ్రహం

## మైనారిటీ హిందువుల హక్కుల కోసం మాట్లాడటం నేరమా అని ప్రశ్న

## సెలెక్టివ్ మానవ హక్కుల కార్యకర్తల మౌనాన్ని తప్పుబట్టిన పవన్

**అమరావతి, మే, 12 (ప్రజావినికిడి):**



బంగ్లాదేశ్‌లో 500 రోజులకు పైగా జైలులో ఉన్న ఇస్కాన్ సన్యాసి చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆయనకు వైద్య సహాయం అందించడంతో పాటు, వెంటనే బెయిల్ మంజూరు చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొందరు మానవ హక్కుల కార్యకర్తలు ప్రదర్శిస్తున్న మౌనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఈ అంశంపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. "500 రోజులకు పైగా జైలు, పదేపదే బెయిల్ నిరాకరణ. ఆయన తరఫు న్యాయవాదులను కూడా కోర్టు హాలులో బెదిరిస్తుంటే ఇక న్యాయం ఎలా జరుగుతుంది? మైనారిటీ హిందూ సమాజం హక్కుల కోసం పోరాడటం నేరమా?" అని ప్రశ్నించారు. కాషాయ వస్త్రాలు ధరించిన ఒక ఆధ్యాత్మిక గురువును నేరస్థుడిలా చూస్తూ, ఆయన గొంతు నొక్కుతుంటే ప్రపంచం మౌనంగా ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. "కొన్ని అంశాలపై హ్యాష్‌ట్యాగ్‌లతో రాత్రికి రాత్రే స్పందించే నకిలీ సెక్యులరిస్టులు, సెలెక్టివ్ మానవ హక్కుల కార్యకర్తలు ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు? వారి మానవత్వానికి కూడా ఫిల్టర్ ఉందా?" అని పవన్ విమర్శించారు. చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు వెంటనే న్యాయపరమైన సహాయం, వైద్యం అందించి, బెయిల్‌పై విడుదల చేయాలని ఆయన కోరారు.

# 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కలవడం సంతోషంగా ఉంది

## : నారా లోకేష్



**న్యూఢిలీ మే, 12 (ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన వీరు, గౌహతి విమానాశ్రయంలో గడ్కరీని కలిశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించిన లోకేష్, ఆయనను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనలో గడ్కరీ చూపిస్తున్న ఉత్సాహం తమందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశాన్ని వేగంగా, బలంగా నిర్మించాలన్న ఆయన తపన అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గడ్కరీ ప్రశంసించారని లోకేష్ వెల్లడించారు.

ఏపీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు నిర్మించేందుకు తాము చేస్తున్న కృషికి ఆయన ప్రోత్సాహం ఎంతో విలువైనదని లోకేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ భేటీలో చంద్రబాబు, గడ్కరీ పలు అంశాలపై చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరు కావాలంటూ కవితకు నోటీసులు

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో రైల్ రోకో

## కవితపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు

## విచారణకు రావాలంటూ సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సమన్లు




**మే, 12 (ప్రజావినికిడి):**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్‌రోకో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఆమెతో పాటు మరో 12 మందిపై రైల్వే యాక్ట్‌లోని యూ/సెక్షన్ 147, 74(ఏ) కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కవితకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది.

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

## స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర -జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి

**హైదరాబాద్ మే, 12 (ప్రజావినికిడి):**సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది. కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ప÷-లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.



# అగ్నిమాపక శాఖలో ఖాళీల భర్తీకి హోంమంత్రి ఆదేశాలు




అమరావతి, **మే, 12 (ప్రజావినికిడి):**
అగ్నిమాపక శాఖ పనితీరుపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ) సచివాలయంలో ఈరోజు (మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడారు. కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్‌స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు.

విశాఖపట్నం పశ్చిమ పారిశ్రామిక ప్రాంతాల్లో ఇండస్ట్రీల భాగస్వామ్యంతో ఫైర్‌స్టేషన్లను ప్రతిపాదించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు. అగ్నిమాపక శాఖలో 1,275 ఖాళీలను దశల వారీగా భర్తీ చేయాలని ఆదేశించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉన్న 305 పోస్టుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫైర్ సిబ్బంది స్పందన సమయాన్ని 30 నిమిషాల నుంచి 15 నిమిషాలకు తగ్గించాలని మార్గనిర్దేశం చేశారు. పరిశ్రమల సహకారంతో ఫైర్ అవుట్‌పోస్టుల ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. ఫైర్ టెండర్ల వినియోగంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాల్లో సమష్టి ఫైర్‌స్టేషన్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. పరిశ్రమల్లో ఫైర్‌సేఫ్టీ అధికారుల నియామకం తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలి..**
లైసెన్స్ పొడిగింపులకు ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయాలని హోంమంత్రి అనిత సూచించారు. అడవిలో అగ్నిప్రమాదాల నియంత్రణలో డ్రోన్ల వినియోగంపై దృష్టిసారించాలని ఆదేశించారు. వ్యర్థాలపై సరైన వర్గీకరణ లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్లలో ఫైర్‌సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. 'ఆపద మిత్ర' తరహాలో యువతకు స్వచ్ఛంద సేవా శిక్షణను విస్తరించాలని సూచించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ విపత్తు నిర్వహణ విధానాలపై అధ్యయనం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఛత్తీస్‌గఢ్, చండీగఢ్ నమూనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అగ్నిమాపక అత్యవసర సేవలను 112 సేవలతో సమన్వయం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

# వైసీపీ నేత నిత్యానందరెడ్డికి 14 రోజుల రిమాండ్

**పెద్ద దస్తగిరి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిత్యానందరెడ్డి**

**ఈరోజు కోర్టులో హాజరుపరిచిన పోలీసులు**


**రిమాండ్ విధించడంతో కడప సెంట్రల్ జైలుకు తరలించిన పోలీసులు**



**కడప మే, 12 (ప్రజావినికిడి):**
కడప జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పెద్ద దస్తగిరి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత నిత్యానందరెడ్డికి న్యాయస్థానం రిమాండ్ విధించింది. పెద్ద దస్తగిరి హత్య కేసులో అరెస్టయిన వైసీపీ నేత నిత్యానందరెడ్డిని పోలీసులు ఈరోజు న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

కడప జిల్లాలో కీలక నేతగా ఉన్న నిత్యానందరెడ్డి అరెస్ట్, రిమాండ్ ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఫ్యాక్షన్ రాజకీయాలు, పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందా అనే కోణంలో చర్చ సాగుతోంది. ఈ కేసు తదుపరి విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# సనాతన ధర్మం పనికిరానిది ..
## రద్దు చేయాలి: ఉదయనిధి స్టాలిన్



**మే, 12 (ప్రజావినికిడి):**
డిఎంకె నేత, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సనాతన ధర్మం ప్రజలను మతం పేరిట విభజిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు స్టాలిన్ కుమారుడు అయిన ఉదయనిధి . 2023 సెప్టెంబర్‌లో లో కూడా సనాతన ధర్మంపై ఇదే వ్యాఖ్యలు చేసి, పలు తీవ్రస్థాయి విమర్శలకు గురి అయ్యారు. తమిళనాడు అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ తొలిసారిగా ప్రతిపక్ష నేత హోదాలో ప్రసంగించారు. సనాతన ధర్మం అనేక అనర్థాలకు దారితీస్తోందని, విభేదాలను పెంచుతోందని, తమిళనాడులో ఈ వాదాన్ని తలెత్తనిచ్చేది లేదని ఉద్వేగభరితంగా తెలిపారు. తమిళ గీతానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తొలి ప్రాధాన్యత ఉండాల్సిందేనని, అతి క్రమణను సహించేది లేదని స్పష్టం చేశారు

తమిళనాడులో అధికారిక లేదా ఏ ఇతర కార్యక్రమాల్లో అయిన జాతీయ గీతానికి ముందుగానే తమిళ తాయ్ వజతూ గీతాలాపనం ఉండాల్సిందే అన్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఏ అధికారిక కార్యక్మంలో అయినా, ఇతర చోట్ల అయినా ముందు వందేమాతరం తరువాత జనగణమన తరువాతనే వేరే గీతాలను ఆలాపించాల్సి ఉంటుందని అధికారిక ఉత్తర్వులతో నోటిఫికేషన్ వెలువరించింది. విజయ్ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం దశలో జరిగిన ఘటనను ఆయన ప్రస్తావించారు. ఇది తొలి పొరపాటు అనుకుంటున్నామని, ఇకపై ఇటువంటివి జరగడానికి వీల్లేదని సిఎం విజయ్‌కు చురకలు పెట్టారు.

# మోదీ పొదుపు మంత్రం...
# రియల్ ఎస్టేట్‌కు దెబ్బేనా?

**ఇంధన పొదుపు కోసం వర్క్ ఫ్రమ్ హోమ్‌ను పరిశీలించాలన్న ప్రధాని మోదీ**

**రికార్డు స్థాయిలో కోలుకున్న కమర్షియల్ రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త ఆందోళన**

**పూర్తిస్థాయి రిమోట్ వర్క్‌కు కంపెనీలు మొగ్గుచూపవని నిపుణుల అంచనా**

**పెద్ద ఇళ్లు, టైర్-2 నగరాల్లో నివాసాలకు డిమాండ్ పెరిగే అవకాశం**



**న్యూఢిల్లీ మే, 12 (ప్రజావినికిడి):**
2025లో రికార్డు స్థాయిలో నమోదైన ఆఫీస్ లీజింగ్ పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో, ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని తిరిగి పరిశీలించాలని పిలుపునిచ్చారు. ఈ పొదుపు మంత్రం ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో, ముఖ్యంగా ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న కమర్షియల్ ఆఫీస్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై తీవ్రమైన చర్చ మొదలైంది.

కరోనా మహమ్మారి తర్వాత కమర్షియల్ రియల్ ఎస్టేట్ రంగం బలంగా కోలుకుంది. జేఎల్‌ఎల్ నివేదిక ప్రకారం, 2025లో దేశవ్యాప్తంగా 83.3 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరిగి రికార్డు సృష్టించింది. బెంగళూరు, హైదరాబాద్, పుణె, ముంబై వంటి నగరాలు అత్యధిక వృద్ధిని నమోదు చేశాయి. ఇలాంటి సానుకూల తరుణంలో ప్రధాని సూచన కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. వర్క్ ఫ్రమ్ హోమ్ మళ్లీ పెరిగితే ఆఫీస్ లీజులు మందగించవచ్చని, పెద్ద క్యాంపస్‌ల విస్తరణలు ఆలస్యం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

అయితే, కంపెనీలు పూర్తిస్థాయిలో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు మొగ్గు చూపే అవకాశాలు తక్కువని నిపుణులు భావిస్తున్నారు. గత రెండేళ్లుగా టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి భారతీయ కంపెనీలతో పాటు అమెజాన్, జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఉద్యోగులను ఆఫీసులకు రప్పించేందుకు గట్టి ప్రయత్నాలు చేశాయి. మెరుగైన సహకారం, ఉత్పాదకత, టీమ్‌వర్క్ కోసం భౌతిక కార్యాలయాలే ముఖ్యమని అవి విశ్వసిస్తున్నాయి. సీఐఐ సర్వేలోనూ ఇదే విషయం స్పష్టమైంది.

ప్రధాని సూచన కమర్షియల్ రంగానికి ఆందోళన కలిగించినా, రెసిడెన్షియల్ మార్కెట్‌కు మాత్రం మేలు చేసే అవకాశం ఉంది. హైబ్రిడ్ పని విధానం మళ్లీ పెరిగితే, సౌకర్యవంతమైన, విశాలమైన ఇళ్లకు డిమాండ్ పుంజుకోవచ్చు. ముఖ్యంగా వరంగల్, గుంటూరు, ఒంగోలు వంటి టైర్-2, టైర్-3 నగరాలకు వలసలు పెరిగి, అక్కడి రియల్ ఎస్టేట్ మార్కెట్ బలపడొచ్చని అంచనాలున్నాయి.

మొత్తం మీద, కంపెనీలు పూర్తిగా వర్క్ ఫ్రమ్ హోమ్‌కు మారడం అసంభవం. కానీ, ఇంధన ధరల పెరుగుదల, ఇతర అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో మరింత ఫ్లెక్సిబుల్ హైబ్రిడ్ మోడల్స్‌ను అనుసరించవచ్చు. ఇది ఆఫీస్ లీజింగ్‌పై స్వల్పకాలికంగా ప్రభావం చూపినా, దీర్ఘకాలంలో భారత ఆఫీస్ మార్కెట్ స్వరూపాన్ని క్రమంగా మార్చే అవకాశం ఉంది.

# ఖర్చులు తగ్గింపు...మోడీ నుంచే మొదలవ్వాలి !



**మే, 12 (ప్రజావినికిడి):**
మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్లు జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700-900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

-------------



# మాజీ ఛాంపియన్‌కు వైల్డ్ కార్డ్.. టాప్ సీడ్స్‌కు తిప్పలేనా..!

మట్టికోర్టు పోరాటాలకు నెలవైన ఫ్రెంచ్ ఓపెన్ (ఖీతీవఅఎష్ట్ర ూజూవఅ)కు మరో ఆరు రోజులే ఉంది. ఇప్పటికే టాప్ సీడ్స్ జన్నిక్ సిన్నర్, జ్వెరెవ్, స్వియాటెక్‌లు తమవైన వ్యూహాలతో బిజీగా ఉండగా.. టోర్నీని మరింత ఆసక్తిగా మార్చేందుకు నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఖరారు చేశారు. మాజీ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా , ఒకప్పటి సెమీస్ ఆడిన గేల్ మోన్‌ఫిల్స్‌కు ఆడే అవకాశమిచ్చింది. మహిళల విభాగంలో ఎనిమిది మంది వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఫ్రెంచ్ ఓపెన్ ఆడనున్నారు. రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించిన వెటరన్ వావ్రింకా ప్రస్తుతం 125వ ర్యాంక్. కానీ, ఈ ఈవెంట్లో అతడు గుర్తుండిపోయే ప్రదర్శనలు చేసిందుకు ఈసారి నిర్వాహకులు అవకాశమిచ్చారు. 2015లో క్వార్టర్స్‌లో రోజర్ ఫెదరర్‌ను ఓడించిన ఉత్సాహంతో.. ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి టైటిల్ కొల్లగొట్టాడీ స్విట్జర్లాండ్ స్టార్. గేల్ విషయానికొస్తే.. ఈ ఫ్రెంచ్ ఆటగాడు 2008లో సెమీస్ వరకూ వెళ్లాడు. కానీ, ఫెదరర్ జోరుకు నిలవలేక చేతులెత్తేశాడు.

# సవాల్ విసిరి చతికిలబడిన పాకిస్థాన్..

## • తొలి విజయంతో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్..!

సొంతగడ్డపై తామెంత ప్రమాదకరమో బంగ్లాదేశ్ (దీుఅస్త్రశ్రీఖుఎవంష్ట్ర) జట్టు మరోసారి నిరూపించింది. తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ భారీ విజయాన్నందుకుంది. 'దమ్ముంటే మా ముందు దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి' అని సవాల్ విసిరిన సల్మాన్ అఘాతల పొగరను అణచివేస్తూ రెండు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రానా (5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది.ఢాకా టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ ధాటికి పాకిస్థాన్ నిలువలేకపోయింది. 268 పరుగుల స్వల్ప ఛేదనలో బ్యాటర్ల వైఫల్యంతో పాక్ కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో నహిద్ రానా(5-40) ఐదు వికెట్లతో బంగ్లాదేశ్ విజయంలో కీలకమయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో పట్టుదలగా ఆడిన పాక్ ఆటగాళ్లు ఏమో ందో ఏమో రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం తేలిపోయారు.



# అక్షర్ పటేల్‌కు భారీ జరిమానా..



ధర్మశాల: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ బిసిసిఐ షాకిచ్చింది. సోమవారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌పై థ్రిల్లింగ్ విక్టరీ సాధించిన ఆనందంలో ఉన్న అక్షర్ పటేల్‌కు భారీ జరిమానా పడింది. స్లో ఓవర్-రేట్ కారణంగా ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం అక్షర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ఐపిఎల్ 2026 సీజన్ లో స్లో ఓవర్-రేట్ సమస్యలు పదేపదే చర్చనీయాంశంగా మారాయి. ఈ సీజన్‌లో పలువురు కెప్టెన్లు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొన్నారు. ఇప్పటికే శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యాలకు స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా ఎదుర్కొన్నారు.కాగా, మ్యాచ్ విషయానికి వస్తే.. పంజాబ్ నిర్దేశించిన 211 పగరుల లక్ష్య ఛేదనలో మొదట తడబడిన ఢిల్లీ.. తర్వాత పుంజుకుని అద్భుత విజయాన్ని అందుకుంది. 19 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి ఢిల్లీ 216 పరుగుల చేసి థ్రిల్లింగ్ విక్టరీని అందుకుంది. ఢిల్లీ బ్యాటర్లలో కెప్టెన్ అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) అర్ధ శతకాలతో రాణించగా.. చివర్లలో అశుతోష్(24), మధవ్(18 నాటౌట్), అకిబ్(10 నాటౌట్) మెరుపులు మెరించడంతో ఢిల్లీ మరో ఓవర్ మిగిలుండగానే మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది.

# కలల కప్ కోసం పకడ్బందీగా.. ఆల్‌రౌండర్లతో సఫారీ స్క్వాడ్..!



మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండడంతో దక్షిణాఫ్రికా బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. గత సీజన్‌లో రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నా.. ఈసారి టైటిల్ లక్ష్యంగా మంగళవారం లారా వొల్వార్డ్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. పొట్టి ఫార్మాట్‌లో రాణిస్తున్న15 మందికి చోటు దక్కగా.. వీరిలో సీనియర్ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ కూడా ఉంది. వరల్డ్‌కప్ కోసం వీడ్కోలు వెనక్కి తీసుకున్న ఆమె మెగా ఈవెంట్‌లో సఫారీ పేస్ దళాన్ని నడిపించనుంది.అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని పట్టేసేందుకు దక్షిణాఫ్రికా సిద్ధమవుతోంది. నిరుడు భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌లో అదిరే ఆటతో ఫైనల్ చేరినా.. అనూహ్యంగా తడబడిన సఫారీ సైన్యం.. ఈసారి టైటిల్ లక్ష్యంగా స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. అనుభవజ్ఞురాలైన లారా వొల్వార్డ్ కెప్టెన్సీలో పొట్టి ప్రపంచకప్‌ను తన్నుకుపోవడానికి వస్తోంది. వన్డే ప్రపంచకప్ ఆడిన చాలామందికి పొట్టి కప్ ఆడబోతున్నారు. కానీ, గత సీజన్‌లో సఫారీ టీమ్ ఫైనల్ చేరడంలో కీలకమైన అనెకే బాస్చ్ మాత్రం ఈ ఎడిషన్‌కు ఎంపికవ్వలేదు.



## టీ20 ప్రపంచకప్ 2026.. దక్షిణాఫ్రికా జట్టు ప్రకటన

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం దక్షిణాఫ్రికా తమ జట్టును ప్రకటించింది. లారా వోల్వార్డ్ జట్టుకు నాయకత్వం వహించనుంది. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న సీనియర్ ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ జట్టులో చోటు దక్కించుకుంది. 37 ఏళ్ల షబ్నిమ్ 2023లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పి.. తన నిర్ణయాన్ని మళ్లీ వెనక్కి తీసుకుంది. అలాగే, గత ఏడాది తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, జట్టులో చేరిన మాజీ కెప్టెన్ డేన్ వాన్ నీకెర్క్ కూడా అవకాశం ఇచ్చారు. వీరితోపాటు టాజ్మిన్ బ్రిట్స్, సునే లూస్, క్లో ట్రయాన్, అయబోంగా ఖాకా వంటి పలువురు అనుభవజ్ఞులైన క్రీడాకారిణులకు జట్టులో చోటు దక్కింది. దక్షిణాఫ్రికా మహిళల టీ20 జట్టు: లారా వోల్వార్ట్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, నాడిన్ డి క్లెర్క్, అన్నరీ డెర్క్‌సెన్, షబ్నిమ్ ఇస్మాయిల్, సినాలో జాఫ్తా (ఔఖ), మారిజాన్నే కప్, అయాబొంగా ఖాకా, సునే లూస్, కరాబో మెసో (ఎఎ), నోన్‌కులులేకో మ్లాబా, కైలా ఫ్లోక్‌హుక్, కైలా ఫ్లోక్‌హుక్, నీకెర్క్.

# మా ప్లానింగే కొంపముంచింది: శ్రేయస్




హైదరాబాద్: ఐపిఎల్‌లో ప్రథమార్థంలో వరసగా ఆరు మ్యాచ్‌లో గెలిచి పంజాబ్ కింగ్స్ పాయింట్ల పట్టికలో తొలి స్థానంలో ఉంది. ద్వితీయ ఆర్థంలో వరసగా నాలుగు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలోకి పడిపోయింది. ఇప్పుడు ప్లే ఆఫ్స్‌కు చేరుకోవడం కష్టం మారింది. మిగిలిన మూడు మ్యాచ్ లలో గెలిస్తేనే పంజాబ్ ప్లేఆఫ్స్ కు చేరుతుంది. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ ఓడిపోయింది. పంజాబ్‌పై ఢిల్లీ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్ తొలుత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోఏయి 216 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ సందర్భంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మీడియాతో మాట్లాడారు.ఈ వికెట్ 210 పరుగులు చేయడం అనేది పెద్ద టార్గెట్ అని చెప్పుకొచ్చాడు. బౌన్స్‌లో మార్పుతో పాటు సీమ్ అవుతుండడంతో తాము 30 పరుగులు ఎక్కువ చేశామని అనిపించిందన్నాడు. పిచ్ సీమర్లకు బాగా అనుకూలించడంతో పేసర్లతోనే బౌలింగ్ చేయించానని, దీంతో చాహల్ పక్కన పెట్టానని శ్రేయస్ వివరించారు. పేస్ బౌలింగ్‌లో వికెట్ల రాకపోవడంతో కెప్టెన్ గా తాను విఫలమయ్యాయని తెలియజేశాడు.

డెత్ ఓవర్లలో హార్డ్ లెంగ్త్‌కే కట్టుబడి ఉన్నామని, క్రీజులోకి వచ్చిన బ్యాటర్‌కు షార్ట్ ఆఫ్ బంతులు వేయడంతో పాటు హార్డ్ లెంగ్త్ పై ఎక్కువగా బంతులు వేయించానని శ్రేయస్ పేర్కొన్నాడు.

మా ప్లానింగ్‌లో లోపంతో పాటు ఎగ్జిక్యూషన్‌లో పర్‌ఫెక్ట్‌గా లేదన్నారు. యుజ్వేంద్ర చాహల్‌తో బౌలింగ్ చేయించకపోవడం ఓటమికి కారణమని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. తొలి ఓవర్ నుంచి 6 ఓవర్ల మధ్య యార్కర్లు సంధించలేదని అందుకే పంజాబ్ ఓటమిని చవి చూస్తిందని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నేనే నాలుగు ఓవర్లు బౌలింగ్ చేశానా?....

# నమ్మలేకపోతున్నా?: డిసి బౌలర్




**హైదరాబాద్:** ఐపిఎల్ లో భాగంగా పంజాబ్ పై ఢిల్లీ ఘన విజయం సాధించింది. పంజాబ్‌పై ఢిల్లీ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్ తొలుత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోఏయి 216 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ విజయంలో ఓ కుర్రాడు కీలక పాత్ర పోషించాడు. మాధవ్ తీవారి నాలుగు ఓవర్ల బౌలింగ్ చేసి రెండు మెయిన్ వికెట్లు పడగొట్టాడు. చివరలో బ్యాటింగ్ కు దిగిన మాధవ్ ఎనిమిది బంతుల్లో 18 పరుగులు చేయడంతో ఢిల్లీ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా అతడు మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించినందకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ జట్టులో ఆటగాడిగా అవకాశం ఇచ్చినందుకు జట్టు మేనేజ్‌మెంట్‌కు థ్యాంక్స్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ సర్ తో బౌలింగ్ చేయడంలో చాలా కష్టపడ్డానని, ప్రతి ప్రాక్టీస్ సెషన్‌లో మెరుగుపరుచుకోవడమే తన లక్ష్యామన్నారు.తాను నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయడం అద్భుతంగా ఉందని, ఈ వికెట్‌పై లెంగ్త్ బంతులు వేయడంతో పాటు వైడ్ బాల్స్, షార్ట్ బాల్స్ వేశానని వివరించాడు. రెండో ఓవర్‌లో ఎక్కువ పరుగులు ఇస్తే తానే బౌలింగ్ చేస్తానని అక్షర్ పటేల్ సరదాగా చెప్పాడని తెలియజేశాడు. బ్యాటింగ్ కోచ్ ఇయాన్ బెల్‌తో కలిసి పవర్ హిట్టంగ్స్‌పై ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తున్నానని వెల్లడించారు. తనలో పవర్ ఉందని బెల్ చెప్పాడని, అనవసరంగా ఫ్యాన్సీ షాట్లు ఆడొద్దని చెప్పాడని, బంతిని బట్టి కదలికలు ఉండాలని కోచ్ చెప్పారన్నారు. క్రికెట్‌లో మంచి చెడులు ఉంటాయని, ప్రాసెస్ కొనసాగించడం చాలా ముఖ్యమన్నారు. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో తన క్యాచ్ డ్రాప్ అయిందని, పరుగులు కూడా వచ్చాయని, తనకు అదృష్టం కలిసి వచ్చిందన్నారు. తాను బౌలర్‌నా? బ్యాట్స్‌మెన్‌నా అనే ప్రశ్నకు మాధవ్ ఆసక్తికర సమాధానాలు ఇచ్చాడు. తాను వంద శాతం బౌలర్, వంద శాత బ్యాట్స్‌మెన్ అని చెప్పాడు.

# దృశ్యం 3 తెలుగు ట్రైలర్ విడుదల..

## ఈసారి వెంకటేష్ రీమేక్ లేదు!




మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' తెలుగు ట్రైలర్ విడుదలైంది. సోమవారం విడుదలైన ఈ ట్రైలర్‌తో తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న ఓ ముఖ్యమైన సందేహానికి తెరపడింది. గత రెండు భాగాల్లా కాకుండా, ఈసారి వెంకటేష్‌తో రీమేక్ ఉండదని, మలయాళ వెర్షన్‌నే తెలుగులో డబ్ చేసి విడుదల చేయనున్నారని స్పష్టమైంది. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా మే 21న ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

ఈసారి కథలో కొత్త కోణాన్ని చూపించబోతున్నట్టు దర్శకుడు జీతూ జోసెఫ్ తెలిపారు. "గత రెండు భాగాల్లో జార్జ్ కుట్టికి తన వెనుక ఎవరున్నారో తెలుసు. కానీ ఈసారి తనను ఎవరు వెంబడిస్తున్నారో, శత్రువు ఎవరో తెలియని భయంలో అతను ఉంటాడు. ఇదే ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది" అని జీతూ జోసెఫ్ వివరించారు. ఈ తెలియని భయమే ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది.

ఇటీవల కొచ్చిలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మోహన్‌లాల్ సరదాగా మాట్లాడుతూ.. "జార్జ్‌కుట్టిని కాపాడమని నేను చాలాసార్లు అడిగాను, కానీ అతను ఇంకా సేఫ్ కాలేదు. కాబట్టి మీరు దృశ్యం 4 కూడా ఆశించవచ్చు" అని వ్యాఖ్యానించి, సీక్వెల్స్‌పై ఆసక్తిని పెంచారు. ఈ చిత్రంలో మీనా, అన్సిబా హసన్, ఎస్తేర్ అనిల్, సిద్దిఖ్, ఆశా శరత్ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 39 నిమిషాలుగా ఉంది. సినిమాకు సెన్సార్ బోర్డు ఖ/యూ సర్టిఫికెట్ జారీ చేసింది. మే 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# శర్వానంద్ 'భోగి'.. మందారంగా డింపుల్ హయతి

యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి హీరోయిన్ డింపుల్ హయతి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'మందారం' అనే పాత్రలో నటిస్తోంది.

"ప్రపంచం కోరుకున్న అందం.. కానీ ఆ ఆత్మను ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు" అనే క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎర్ర చీరలో డింపుల్ హయతి ఎంతో పవర్‌ఫుల్‌గా, బోల్డ్‌గా కనిపిస్తోంది. చేతిలో విసనకర్ర పట్టుకుని తీక్షణంగా చూస్తున్న ఆమె లుక్, 1960ల నాటి వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఉంది. ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా, ఎవరినీ లెక్కచేయని తత్వంతో ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది.

ఇటీవలే ఈ సినిమా నుంచి మరో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆమె 'కందుల సులోచనా రాణి' అనే పాత్రలో మోదుగ ఆకులతో బుట్టలు అల్లే పల్లెటూరి యువతిగా కనిపించింది. ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నాడు.

1960ల కాలంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న రక్షాబంధన్ కానుకగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు.



# హీరోల బాటలో రకుల్ యూటర్న్..

## మరో రమ్యకృష్ణ కానుందా?

ఒకప్పుడు హీరోలు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకొని.. ఆ తర్వాత యూటర్న్ లో భాగంగా విలన్ గా ప్రేక్షకులను మెప్పిస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే గ్లామర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఎప్పుడూ చిలిపి పాత్రలు, గ్లామరస్ రోల్స్‌తో అలరించే ఈ భామ, ఇప్పుడు ఏకంగా రామాయణంలో 'శూర్పణఖ'గా నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో కనిపించబోతోంది. నితేష్ తివారీ ప్రతిష్టాత్మక చిత్రంలో రకుల్ చేస్తున్న ఈ ప్రయోగం చూస్తుంటే, ఆమె మరో రమ్యకృష్ణలా పవర్‌ఫుల్ విలనిజం పండించబోతోందని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఈ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ విశేషాలు మీకోసం..

నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇండియన్ బిగ్గెస్ట్ మూవీ 'రామాయణ'లో రకుల్ ప్రీత్ సింగ్ ఎంట్రీ ఖరారైందనే వార్త ఫిల్మ్ నగర్‌లో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ సినిమాలో రావణాసురుడి సోదరి శూర్పణఖ పాత్రను రకుల్ పోషించబోతుందట. ఎప్పుడూ కమర్షియల్ సినిమాల్లో మెరిసే రకుల్, కథను మలుపు తిప్పే ఇలాంటి క్లిష్టమైన పాత్రను ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

గతంలో రమ్యకృష్ణ వంటి వారు నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలు చేసి తమ నట విశ్వరూపాన్ని చూపించారు. ఇప్పుడు రకుల్ కూడా అదే బాటలో నడుస్తోంది. హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనకు ఆస్కారమున్న నెగటివ్ షేడ్స్ కూడా చేయగలనని ఆమె నిరూపించుకోవాలని చూస్తోంది. ఈ పాత్ర కనుక క్లిక్ అయితే, రకుల్ కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోవడం ఖాయం.ఈ సినిమాలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. కన్నడ రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడిగా కనిపించబోతుండగా, ఆయనకు సోదరిగా రకుల్ తన పెర్ఫార్మెన్స్‌తో పోటీ పడనుంది. ఇక యష్, రకుల్ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంటుందోనని అభిమానులు ఇప్పటి నుంచే ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.శూర్పణఖ పాత్ర రామాయణంలో చాలా కీలకమైనది. ఒకరకంగా కథలో ఘర్షణ మొదలయ్యేది ఆమెతోనే. ఈ పాత్రలో రకుల్ సక్సెస్ అయితే, భవిష్యత్తులో ఆమె కోసం మరిన్ని వైవిధ్యమైన, నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలు క్యూ కట్టడం గ్యారెంటీ. కేవలం అందంతోనే కాదు, తనలోని నటనతోనూ ఆడియన్స్‌ను భయపెట్టేందుకు రకుల్ సిద్ధమవుతోంది.స్టార్ హీరోయిన్ స్థాయి నుంచి గ్రే షేడ్ పాత్రకు యూటర్న్ తీసుకోవడం రకుల్ చేస్తున్న పెద్ద రిస్క్ అనే చెప్పాలి. కానీ, ఇలాంటి రిస్క్ తీసుకుంటేనే నటిగా గుర్తింపు వస్తుంది. మరి రామాయణంలో శూర్పణఖగా రకుల్ ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

# ఎన్టీఆర్-నీల్ క్రేజీ అప్డేట్..

## ముందుగానే ఫస్ట్ గ్లింప్స్?

2027 జూన్ 11న సినిమా రిలీజ్ అని తాజా సమాచారం


యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్' ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలు నెలకొన్నాయి. కాగా, తారక్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేస్తారని అందరూ భావించారు.అయితే, అభిమానుల ఉత్సాహాన్ని మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే ఈ గ్లింప్స్‌ను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మే 19 అర్ధరాత్రి 12 గంటలకు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసి, తారక్ పుట్టినరోజు వేడుకలను ముందుగానే ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. దీంతో అభిమానుల సంబరాలు అర్ధరాత్రి నుంచే మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది.మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రం '===' తర్వాత తారక్ చేస్తున్న సోలో ప్రాజెక్ట్ కావడంతో దీనిపై భారీ హైప్ నెలకొని ఉంది. ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ప్రశాంత్ నీల్ మార్క్ యాక్షన్, ఎలివేషన్స్‌తో తారక్‌ను ఎలా చూపిస్తారోనని సినీ ప్రియులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.



# మహాకాళేశ్వరుడి సన్నిధిలో తమన్నా..

ప్రముఖ నటి తమన్నా ఈ తెల్లవారుజామున మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శించారు. బ్రహ్మ ముహూర్తంలో జరిగే అత్యంత పవిత్రమైన 'భస్మ హారతి' సేవలో ఆమె పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, తన స్నేహితురాలు, నిర్మాత ప్రజ్ఞా కపూర్‌తో కలిసి ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణలు, గంటల నాదాల మధ్య జరిగిన ఈ క్రతువులో తమన్నా అత్యంత భక్తిశ్రద్ధలతో లీనమై ప్రార్థనలు చేస్తున్న వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

దర్శనం అనంతరం తమన్నా మీడియాతో మాట్లాడుతూ, "దైవ పిలుపు ఉన్నప్పుడే ఎవరైనా ఈ క్షేత్రాన్ని దర్శించుకోగలరు. ఈ రోజు భస్మ హారతిని వీక్షించే అవకాశం కలగడం నా అదృష్టం. అక్కడ కూర్చుని ఆ ఆధ్యాత్మిక ప్రకంపనలను అనుభూతి చెందడం ఒక గొప్ప శక్తిని ఇచ్చింది" అని తన సంతోషాన్ని పంచుకున్నారు. ఆలయ గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, తన రాబోయే ప్రాజెక్టులు విజయవంతం కావాలని మొక్కుకున్నారు.సినిమాల విషయానికి వస్తే, తమన్నా త్వరలో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వ్యాన్' అనే ఫోక్‌లోర్ థ్రిల్లర్‌లో నటించబోతున్నారు. ఏక్తా కపూర్, టీవీఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 28న రక్షా బంధన్ కానుకగా విడుదల కానుంది. మధ్య భారతదేశంలోని దట్టమైన అడవుల నేపథ్యంలో, పురాతన ఇతిహాసాలు, దేవాలయాల చుట్టూ ఈ కథ సాగనుంది. దీపక్ మిశ్రా, అరుణభ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613